ప్రణాళిక లేకనే ఇన్ని సమస్యలు

- రైతులను తక్షణం ఆదుకోవాలి: సీపీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిర్దిష్టమైన వ్యవసాయ ప్రణాళిక లేకపోవడం, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పేర్కొంది. రైతు సమస్యలను ప్రస్తావిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం నాయకులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జీ నాగయ్య, టీ సాగర్ లేఖ రాశారు. ఇటీవల సీపీఎం ప్రతినిధుల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించిదని, ఈ సందర్భంగా పలు సమస్యలను గుర్తించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లు రోజురోజుకు మరింత కుంగుతున్నాయని, వర్షాలు పడితే మరింత కుంగిపోయే ప్రమాదముందని తెలిపారు. అన్నారం బ్యారేజీ వద్ద ఏర్పడిన బుంగను తాత్కాలికంగా పూడ్చినప్పటికీ ప్రమాదం పొంచి ఉన్నదని చెప్పారు. అయితే ఈ సమస్యలను పరిష్కరించడానికి కొంత సమయం పట్టే అవకాశమున్నప్పటికీ రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీరాం సాగర్, మానేరు, మల్లన్నసాగర్ తదితర జలాశయాల్లోని నీటి నిల్వలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి విడుదలకు ఉన్న అవకాశాలను పరిశీలించి నీటిని రైతులకు అందించాలని సూచించారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు కోరారు.

మిత్తి కట్టలేక మృత్యు ఒడికి!

- అప్పులు తీర్చలేక అన్నదాత ఆత్మహత్య
- కుటుంబసభ్యుల ఎదుటే విషగుళికలు తిని..
- పంట కోసం బోరు తవ్వకం
- కుమారుడికి మానసిక వైకల్యం
- రైతు బీమా లేదు.. ఆదుకునే వారే కరువు

కాన్గల్‌లో రేకుల ఇంట్లో కనకయ్య భార్యాపిల్లలు, పక్కన కనకయ్య వ్యవసాయ బోరు

సిద్దిపేట, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉన్నదే ఎకరం పొలం. సాగునీళ్ల అండక కండ్ల ముందే యాసంగి పంట ఎండిపోతున్నది. పంటను కాపాడుకోవడానికి అప్పు చేసి బోరు తవ్వించాడు. 750 ఫీట్లు వేస్తేగానీ నీటి బొట్టు జాడ దొరకలేదు. వచ్చిన కొద్దిపాటి నీళ్లతో పంట దిగుబడి ఆశలేదు. ఇది వరకు ఉన్న అప్పులకు, బోరుబావి అప్పులు తోడయ్యాయి. అన్నీ కలిపి తడిసి మోపెడయ్యాయి. సగానికి పైగా మేకలమ్మినా మిత్తీలకే సరిపోయింది. ఇక అసలెట్ల తీరేదీ ? బాకీ ఎట్లా కట్టేదీ ? ఆలోచనలో పడ్డ రైతు.. కుటుంబ సభ్యుల ఎదుటే విషగుళికలు తిన్నాడు. తన పెళ్లిరోజే చావు కొగిట్లోకి ఒరిగాడు. పెళ్లి రోజే పసుపు కుంకుమలకు దూరమై మానసిక వైకల్యం ఉన్న కొడుకు, 15 నెలల చిన్నారితో భారంగా ఆ తల్లి బతుకీడిస్తున్నది. ఇదీ సిద్దిపేట జిల్లా తొగుట మండలం కాన్గల్‌కు చెందిన ముచ్చర్ల కనకయ్య కుటుంబ కన్నీటి కథ.

సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట మండలం కాన్గల్ గ్రామానికి చెందిన ముచ్చర్ల బాలయ్యకు ఇద్దరు కుమారులు. ఇద్దరు కుమారులు సొంతూరులోనే వ్యవసాయం చేసుకుంటున్నారు. చిన్న కుమారుడు ముచ్చర్ల కనకయ్య(30)కు భార్య వాణి, కుమారుడు సాత్విక్ (7), కూతురు ప్రియాన్షిక (15నెలలు) ఉన్నారు. ఈ కుటుంబానికి ఉమ్మడిగా మూడు ఎకరాల వరకు పొలం ఉంది. రైతు ముచ్చర్ల కనకయ్యకు తన వాటా కింద ఎకరంపైగా భూమి వస్తుంది. అయితే ఆ భూమి కనకయ్య పేరు మీద లేదు. ఉన్నదాంట్లోనే వరి సాగు చేస్తున్నాడు. వ్యవసాయంతో పాటు కూలీ పనికెళ్తూ, ఓ పది మేకలను పెంచుకుంటున్నాడు. యాసంగిలో పొలం పారకపోయేసరికి బోరు వేయాలనుకున్నాడు. అప్పులు తెచ్చి జనవరి 1న బోరు తవ్వించాడు. నీళ్ల కోసం 750 ఫీట్లకుపైగా బోరు వేయించాడు. అంత లోతుకు వేయడంతో కొద్దిపాటి నీళ్లు వచ్చాయి. మళ్లీ అప్పులు తీసుకువచ్చి బోరుకు మోటరు, పైపులు బిగించారు. మొత్తంగా బోరు కోసం నాలుగు లక్షల అప్పు చేస్తే కొద్దిగా నీళ్లు పోస్తుంది. బోరు వేసి ఇలా రెండు నెలలు గడిసిపోయింది. అంతకు ముందే రెండు లక్షల వరకు అప్పులు ఉన్నాయి. వీటికి బోరు కోసం తెచ్చిన అప్పులు జతకలిశాయి. నెల నెలా మిత్తీలు పెరుగుతున్నాయి. ఉన్న పది మేకల్లో ఆరు అమ్మేసి మిత్తీలు కట్టాడు. ఇక అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాలేదు. చివరికి ఆత్మహత్యే శరణ్యమనుకున్నాడు.

సర్కారు సాయమేది ?

కనకయ్యకు ఉన్న ఎకరం పొలం.. ఆయన తండ్రి పేరు మీదనే ఉన్నది. దీంతో కనకయ్యకు రైతు బీమా సాయం రాలేదు. కనకయ్య చనిపోయి నెల దాటినా ఆ కుటుంబాన్ని ఓదార్చేవారే కరువయ్యారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకులు కనీసం పలుకరించలేదు. పుట్టెడు కష్టాల్లో ఉన్న వాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెండ్లిరోజే చావుమేళం

'ఆ రోజు కనకయ్య పొద్దుగాళ్లే లేచి పొయ్యి మీద ఛాయ్ పెట్టిండు.. పిల్లలకు ఛాయ్ పోసి.. తానూ తాగి పొలానికెళ్లిండు. పొలం పనులు చూసుకొని ఇంటికొచ్చేసరికి నేను బట్టలు ఉతుకుతున్న' అంటూ ఆరోజు జరిగిన ఘటనను కండ్లలో నీళ్లు తీసుకుంటూ వివరించింది కనకయ్య భార్య వాణి. 'ఇంట్లో ఎవ్వరితోనూ మాట్లాడలే.. ఉడికిన బువ్వ పళ్లెంల పెట్టుకుని తిన్నడు. ఓ బీడీ ముక్క తాగుతూ ఆలోచనలో పడ్డడు. ఇంటి నుంచి వెళ్తూ.. మళ్లత్తా అని జెప్పి బయటకు పోయి...విషగుళికలు తెచ్చుకున్నాడు. నామ నస్సు ఏం బాగాలేదు.. పిల్లలు జాగ్రత్త.. అని నాకు చెబుతూనే వెంట తెచ్చుకున్న విషగుళికల ప్యాకెట్ ఇప్పి వాకిట్లోనే నోట్లో వేసుకున్నడు' అని గోడు వెళ్లబోసుకున్నది. 'అయ్యో .. ఎంతపని జేస్తివి' అంటూ భోరున విలపిస్తూ నేను మా కుటుంబసభ్యులు, ఇంటి పక్కల వాళ్లు కలిసి కనకయ్యను అంబులెన్స్‌లో సిద్దిపేట పెద్ద దవాఖానకు తరలించాం. అక్కడ మూడురోజులు మృత్యువుతో పోరాటం చేసి మార్చి 3న జీవిడిశిండు అని కనకయ్య భార్య విలపిస్తూ తెలిపింది. ఇదే రోజు వారి పెండ్లిరోజు. తొమ్మిదో ఏట పడుతున్న పెళ్లిరోజునే వాళ్లింట్లో చావు డప్పు మోగింది. మిగిలిన నాలుగు మేకలు అమ్మి దినవారం చేశామని కనకయ్య భార్య వాణి గొల్లుమని ఏడ్చింది. కుమారుడు సాత్విక్‌కు మానసిక వైకల్యం ఉందని, 15 నెలల చిన్న పాపను సాకేదెట్లా అని ఆమె కన్నీరు కార్చింది. ఓ చిన్న అర్ర, ముందట రేకులు మాత్రమే ఉన్న ఆ ఇంట్లో బతికేదెట్లా ? అంటూ బోరుమన్నది.

రోడ్డున పడ్డ కౌలురైతు

- సాగునీరు లేక ఎండిన పంటలు
- పెట్టిన పెట్టుబడి అదనపు నష్టం
- భూయజమానికి కౌలు చెల్లించాల్సిందే
- ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు కౌలు
- రైతు భరోసాపై మాటే ఎత్తని కాంగ్రెస్ సర్కార్
- రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా కౌలు రైతులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో నిన్న మొన్న టివరకూ రైతే రాజు. పదేండ్లలో పెరిగిన సాగునీటి లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వమే కల్లాల వద్దకు వచ్చి పంటకు కాంటా వేయడంతో రైతులు కూర్చున్న చోటే రాజుల్లా పైసలు లెక్కబెట్టుకున్నారు. కానీ గత మూడు నెలల్లో వారి పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. భూయజమానులుగా ఉన్న రైతుల పరిస్థితులే ఇలా ఉంటే.. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సాగునీటి కొరత ఒకవైపు,అకాల వర్షాలు మరో వైపు పంటను ధ్వంసం చేశాయి. దీంతో 20 లక్షల మంది కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.పెట్టుబడి కోసం చేసిన అప్పు వారికి నిద్రలేని రాత్రులను తెచ్చిపెడుతున్నది.

రైతు భరోసా ఏది?

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయం చేసే వారికందరికీ రైతుభరోసా పథకాన్ని వర్తింపజేస్తామని హామీ నివ్వడంతో కౌలురైతులు సంతోషించారు. కానీ నాలుగు నెలలు దాటుతున్నా రైతు భరోసాపై అతీగతీ లేదు. కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుళ్ల గ్రామానికి చెందిన కౌలు రైతు శంకర్ పది ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. ఎకరానికి రూ.20వేల చొప్పున చెల్లిస్తానని భూయజమానితో ఒప్పందం చేసుకున్నాడు. నిరుడు లాభాలు బాగానే ఉండటంతో ఈ సారి వరి వేశాడు. ఇందుకోసం ఎకరానికి రూ.40వేల పెట్టుబడి పెట్టాడు. కానీ కావాల్సినంత సాగునీరు సరఫరా లేకపోవడంతో పంటంతా ఎండిపోయింది. దీంతో శంకర్ పూర్తిగా నష్టపోయాడు. ఓ వైపు పెట్టుబడి నష్టపోగా.. మరోవైపు భూ యజమానికి కౌలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దిగుబడే లేని పరిస్థితిలో కౌలు ఎలా చెల్లించగలనని శంకర్ బావురుమంటున్నాడు.

సాగు నీరుండదని ముందే చెప్పలేదు

జూబిలీనగర్‌కు చెందిన ఎం రెడ్డి పరిస్థితి కూడా దాదాపు ఇదే. 4 ఎకరాలు కౌలుకు తీసుకున్నానని, రైతు భరోసా వస్తుందన్న నమ్మకంతో సాగు మొదలుపెట్టానని చెప్పాడు. రైతు భరోసా సంగతే మోగానీ ఈ ప్రభుత్వం సాగునీటిని కూడా అందించలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

రాష్ట్రంలో విస్తారంగా అందుబాటులోకి వచ్చిన సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని దాదాపు 20 లక్షల మంది కౌలు రైతులు ఈ యాసంగిలో భూములను కౌలుకు తీసుకొని సాగు మొదలు పెట్టారు. భూమి నాణ్యత, వచ్చే దిగుబడిని అంచనా వేసి ఎకరానికి రూ.15వేల నుంచి రూ.25వేల వరకూ భూయజమానికి చెల్లించేందుకు ఒప్పందాలు చేసుకున్నారు. కానీ సాగునీటి ఎద్దడి కారణంగా సుమారు 15 లక్షల ఎకరాలలో పంటలు పూర్తిగా ఎండిపోయినట్టు తెలుస్తున్నది. దీంతో చేసిన కష్టానికి లాభాలు వచ్చు డేమో గానీ కనీసం కౌలు చెల్లించేంత ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ఎన్నికల కోడ్ పేరిట కాలయాపన

రాష్ట్రంలో నెలకొన్న కరువు నేపథ్యంలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కే రవి పేర్కొన్నారు. రైతు భరోసా పథకం కింద కౌలు రైతులకు కూడా ఎకరానికి రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటిపోయినా కౌలు రైతులను గుర్తించేందుకు గానీ, వారికి ఆర్థిక సాయం చేసేందుకు గానీ ఎటువంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతోపాటు పలు ఇతర సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గత నెలలోనే ప్రభుత్వానికి ఒక వినతిపత్రం సమర్పించామని చెప్పారు. కానీ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల కోడ్ పేరుతో కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. కోడ్ ఎత్తివేసేలోగా రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ముగిసిపోతుందని, కౌలు రైతులు బజారున పడే పరిస్థితి నెలకొంటుందని అన్నారు.

అటకెక్కిన 'ధరణి' ప్రక్షాళన!

మొదటిపేజీ తరువాయి...

కమిటీ నియమించింది. ఐదుగురు సభ్యుల కమిటీ వివిధ దశల్లో చర్చలు జరిపి ప్రభుత్వానికి తొలివిడతగా కొన్ని సూచనలు చేసింది. దీని ప్రకారం ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి మార్చి 1వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ పేరుతో కార్యక్రమం ప్రారంభించింది. ధరణిలో వివిధ మాడ్యూళ్ల కింద మొత్తం 2,46,536 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 9 రోజుల్లోగా పరిష్కరిస్తామని ప్రకటించింది. తహసీల్దార్‌స్థాయి నుంచి సీసీఎల్‌ఏ వరకు కమిటీలు వేసి, వారికి పరిష్కార బాధ్యతలు అప్పగించింది. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే పరిష్కరించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు గరిష్ఠంగా వారం రోజుల గడువు విధించింది. క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తయ్యాక తహసీల్దార్‌కు, ఆర్డీవోకు, కలెక్టర్‌కు నివేదికలు అందించడం, దరఖాస్తును డిస్పోజ్ చేయడం 9 రోజుల్లో సాధ్యం కాదని నిపుణులు అప్పుడే స్పష్టం చేశారు. అప్పట్లో మార్చి మొదటివారంలో ఎన్నికల కోడ్ వస్తుందనే ప్రచారం జరగడంతో తూతూ మంత్రంగా నాలుగైదు రోజులు హడావుడి చేసి, కోడ్‌ను అడ్డం పెట్టుకొని నిలిపివేసే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు స్పెషల్ డ్రైవ్ నాటకం మొదలుపెట్టిందని ఆరోపణలు కూడా వచ్చాయి. దీనికి తగ్గట్టే ప్రభుత్వం మొదటి 9 రోజుల్లో ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించలేదు. ఎన్నికల కోడ్ రాకపోవడంతో స్పెషల్ డ్రైవ్‌ను మార్చి 17 వరకు పొడిగిస్తూ 11న ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం అంచనా వేసినట్టే కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. కోడ్‌ను సాకుగా చూపి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌కు బ్రేకులు వేసింది. ఆధార్ సీడింగ్, అక్షర దోషాలు, పేర్లు తప్పుగా పడడం వంటి చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా పక్కన పెట్టేయడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పార్ట్-బి దరఖాస్తులకూ దిక్కులేదు

భూ సమస్యలకు సంబంధించి హక్కుల్లో స్పష్టత లేని భూములను రెవెన్యూ అధికారులు పార్ట్-బి అని పిలుస్తుంటారు. మొదట్లో సుమారు 26 లక్షల ఎకరాల వరకు పార్ట్-బిలో ఉండేవని, ఇందులో 8 లక్షల ఎకరాలను కేసీఆర్ ప్రభుత్వం పరిష్కరించిందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. మిగతా 18 లక్షల ఎకరాలతోపాటు, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కేసీఆర్ ప్రభుత్వం మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ నియమించింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం పార్ట్-బిలోని భూముల సమస్యల పరిష్కారానికి వివిధ దశల్లో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అత్యధిక శాతం తుది దశ అనుమతుల వద్దే నిలిచిపోయినట్టు సమాచారం. ప్రభుత్వం తలచుకుంటే గత నాలుగు నెలల్లో పార్ట్-బిలోని లక్షలాది ఎకరాలకు మోక్షం కల్పించి ఉండేదని అధికారులు చెప్తున్నారు. ఇవన్నీ పరిష్కారం అయితే దాదాపు 10 లక్షల ఖాతాలకు లబ్ధి చేకూరుతుందని అంచనా. అదే జరిగితే రైతుబీమా, రైతు భరోసా వంటి పథకాలపై అధిక భారం పడుతుందని, కొన్ని నెలలు పక్కన పెట్టాలని ఉన్నతాధికారులు సూచించినట్టు తెలిసింది.

నిజామాబాద్ జిల్లా ట్యాక్లీలో పంటనష్టపోయిన రైతు సాయినాథ్‌ను ఓదార్చుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి

రాళ్లవాన బీభత్సం

- నిజామాబాద్ జిల్లాలో వడగండ్లవాన
- ఏడు మండలాల్లో అకాల వర్షం
- చేతికొచ్చిన వరి నేలపాలు
- రాలిన మామిడి, కూరగాయలు
- 1200 ఎకరాల్లో పంటనష్టం

బోధన్ రూరల్/ కోటగిరి / చందూర్, ఏప్రిల్ 9 : తెల్లారితే ఉగాది పండుగ. పండుగ ఏర్పాట్లలో మునిగితేలిన రైతులకు అకాల వర్షం తీరని శోకం మిగిల్చింది. చేతికొచ్చిన పంటనంతా నేలరాల్చింది. నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 6 తరువాత మొదలైన వాన దాదాపు 2 గంటల పాటు దంచికొట్టింది. పొట్టకొచ్చిన వరి పంటంతా ఒరిగి వడ్లు రాలిపోయాయి. కూర గాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లో మామిడికాయలు నేలరాలాయి. 'యాడికెళ్లి వచ్చిందో మాయదారి రాళ్లవాన మా పుట్టిముంచింది' అంటూ రైతులు కన్నీరు కారుస్తున్నారు. జిల్లాలోని సుమారు ఏడు మండలాల్లో దాదాపు 1200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. అధికారులు పంటలను పరిశీలిస్తే.. ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. చందూర్ మండల కేంద్రంతోపాటు లక్ష్మాపూర్, మేడిపల్లి, లక్ష్మీసాగర్ గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కోటగిరి, పొతంగల్ మండలాల్లోని సోంపూర్, టాక్లీ, దోమలెడ్గి, వల్లభాపూర్, సుంకిని గ్రామాల్లో 600 ఎకరాల వరకు వరి పంట నేలమట్టం అయిందని అధికారులు తెలిపారు. బోధన్, సాలూర మండలాల్లో సుమారు 300ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. మందర్నలో కోతకొచ్చిన మామిడికాయలు ఈదురుగాలులు, వడగండ్లకు రాలిపోయాయి. కోటగిరి, చందూరు తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి పరిశీలించి, బాధిత రైతులను ఓదార్చారు.

బిడ్డ పెండ్లెట్ల చేయాలె..

ఈ నెల 26న నా బిడ్డ పెండ్లి పెట్టుకున్న. టాక్లీ శివారులో 18ఎకరాలు కౌలు తీసుకొని వరి సాగు చేసిన. అప్పులు చేసి పంట పండించిన. పంట బాగా వచ్చింది. దిగుబడి కూడా బాగానే వస్తది అనుకున్న. ధాన్యం అమ్మిన డబ్బులతో బిడ్డ లగ్గం చేద్దామనుకున్న. మాయదారి వడగండ్ల వాన నాకు కన్నీరు మిగిల్చింది. వరి పూర్తిగా నేలకొరిగింది. గింజలన్నీ రాలిపోయాయి. ఇప్పుడు బిడ్డ పెండ్లి ఎట్లా చేయాలె.

– సాయినాథ్, రైతు, భాజాపూర్

వడ్లకు వాన ముప్పు!

మొదటిపేజీ తరువాయి...

రైతులు రోడ్డుపై ధాన్యం పోసి నిప్పంటించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇక నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో సోమవారం కురిసిన వర్షానికి కేంద్రంలోని ధాన్యం తడిసి ముద్దయ్యాయి. ఇదీ క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం 5,923 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో ధాన్యం ముందుగా కోతకు వచ్చే ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్ జిల్లాలోనే సమస్యలు వస్తున్నాయి. ఇక సోమవారం పౌరసరఫరాల శాఖ విడుదల చేసిన ప్రకటనలో 6 జిల్లాల్లో 556 కొనుగోలు కేంద్రాల నుంచి 72071 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. అంటే 5,923 కేంద్రాలు ప్రారంభిస్తే కేవలం 556 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనట్లు చెప్పకనే చెప్పారు.

కొత్తూరు గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు ఎండబోస్తున్న రైతు యెగ్గని సత్తయ్య

గతం కన్నా తక్కువ కేంద్రాలు !

గతం కన్నా ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల సంస్థ ప్రకటించింది. గతంలో 7037 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ సీజన్‌లో మరో 112 అదనంగా 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కానీ ఈ లెక్కలన్నీ అవాస్తవాలే అని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపాదిత కేంద్రాలు(ప్రపోజ్డ్ సెంటర్స్), ప్రారంభించిన కేంద్రాలు(ఓపెన్డ్ సెంటర్స్) లెక్కలను తారుమారు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత సీజన్‌లో కేసీఆర్ సర్కారు 7192 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రతిపాదించింది. ఇందులో 7034 కేంద్రాలను ప్రారంభించి.. ధాన్యం కొనుగోలు చేసింది. కాంగ్రెస్ సర్కారు ఈ సీజన్‌లో 7149 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రతిపాదించింది. ఇందులో ఇప్పటి వరకు 5923 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదిత కేంద్రాల సంఖ్య(7149)నే ప్రారంభించే కేంద్రాల సంఖ్యగా చెబుతున్నది. ఈ లెక్కన గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం ఈ సీజన్‌లో 112 కొనుగోలు కేంద్రాలను తక్కువగా ప్రతిపాదించింది. ఒకవేళ ప్రతిపాదించిన మొత్తం కేంద్రాలను ప్రారంభిస్తే పర్వాలేదు.. కానీ ప్రారంభించని పక్షంలో గత ప్రభుత్వం కన్నా ఈ సీజన్‌లో తక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అవుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొంటరో కొనరో...

వడ్లు తెచ్చి కొనుగోలు కేంద్రంలో పోసి మూడు రోజులైతది. ఇక్కడ ఒక్క అధికారి కూడా కనిపిస్తలేరు. మా ఊరిలో కొనుగోలు కేంద్రం ఎవరికి వచ్చిందో అర్థం కావడం లేదు. పోయినసారి కొన్నోళ్లకు ఫోన్ చేస్తే మాకు రాలేదని చెప్తున్నారు. వ్యవసాయశాఖ వాళ్లకు ఫోన్ చేస్తే మాకేం తెల్వదు అంటున్నరు. ఈ ఎండకాలం మా వడ్లు అసలు కొంటరా కొనరా.. ఏం అర్థమైతలేదు. మా రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో మాదిరిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అకాల వర్షాలు రాకముందే వడ్లు మిల్లుకు పోయేలా చూడాలి.

– కే శ్రీనివాస్, ఇటిక్యాల గ్రామం, లక్షెట్టిపేట మండలం.

ఎండలో కావలుంటున్నం

సాగు నీళ్లు లేక పోవడంతో రెండెకరాల పొలంలో ఎకరం ఎండిపోయింది. ఉన్న ఎకరం పొలం కోసి వడ్లను చెన్నారం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి 15 రోజుల కింద తీసుకొచ్చిన. రెండు రోజుల క్రితం అధికారులు కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిండ్రు. అయినా కొనుగోళ్లు చేయడం లేదు. పండిన కొద్దిపాటి ధాన్యానికి ఎండలో కావలి కాయాల్సి వస్తున్నది. అధికారులను అడిగితే రేపు మాపు అంటున్నారు. అసలు కాంట వేస్తరో లేదో తెలియదు.

–చెన్నగోని యాదయ్య, తంగేళ్లవారిగూడెం, కనగల్ మండలం.

పట్టాలకే రోజుకు రూ.300

నాకున్న ఐదున్నర ఎకరాల్లో పొలం నాటు పెడితే నీళ్లు లేక ఎకరంన్నర ఎండిపోయింది. ఉన్న కొద్ది పాటి ధాన్యాన్ని పదిహేను దినాల క్రితమే కోసి అమ్ముకుందామని కేంద్రానికి తెచ్చిన. ఇప్పటికీ కొనుగోళ్లు మొదలు పెట్టలే. వర్షం నుంచి ధాన్యం కాపాడుకునేందుకు 25 పట్టాలు కిరాయికి తెచ్చిన. రోజుకు రూ. 300 ఖర్చవుతున్నది. ఇటు పంటలు ఎండిపోయి నష్టపోయినం. అటు కొనుగోళ్లు మొదలు పెట్టక పట్టాల ఖర్చుతో నష్టపోతున్నాం.

– ముత్తినేని యాదయ్య, రైతు, చిన్నసూరారం, నల్లగొండ మండలం.

పాంచి ఉన్న వాన ముప్పు

రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ధాన్యం రైతుల్లో ఆందోళన మొదలైంది. ఓ వైపు వానముప్పు.. మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. వెరసి ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలను సర్కారు సమకూర్చలేదనే విమర్శలున్నాయి. పండించిన ధాన్యం నీళ్ల పాలు కావొద్దని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, వర్షానికి ధాన్యం తడవకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో తమకు ఆ దేవుడే దిక్కంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట చేతికొస్తున్నా పైసా ఇవ్వలే!

- ఐదెకరాల రైతులకు రైతుబంధు పంపిణీ పూర్తయిందన్న సర్కారు
- రెండుమూడెకరాల రైతులకూ అందలే
- పెట్టుబడి కోసం అన్నదాతల అప్పులు
- 4 నెలలవుతున్నా పూర్తికాని పంపిణీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం 11 విడతలపాటు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి రైతుబంధు సాయం అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఒక్క విడత అందించేందుకే ఆపసోపాలు పడుతున్నది. డిసెంబర్‌లో మొదలుపెట్టి నాలుగు నెలలు గడుస్తున్నా పంపిణీ ఇంకా సాగుతూనే ఉంది. ఐదెకరాల వరకు రైతుబంధు పంపిణీ పూర్తయినట్టు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రెండు, మూడు ఎకరాల రైతులకు కూడా ఇప్పటి వరకు రైతుబంధు అందలేదు. కొత్తగూడేనికి చెందిన మొడియం సీతారాములుకు ఉన్నది రెండెకరాలే అయినా ఇప్పటికీ రైతుబంధు పడలేదు. మూడున్నర ఎకరాల భూమి ఉన్న మిర్యాలగూడకు చెందిన పతంగి వెంకటేశ్వర్లుదీ అదే కథ. వీళ్లిద్దరే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది రైతులు ఇలాంటి కష్టాలే ఎదుర్కొంటున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం 64.75 లక్షలమంది (92.68శాతం) రైతులకు రైతుబంధు జమచేసినట్టు చ